సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 21 । జూన్ । 2023



22వేల చేనేత మగ్గాలు

రాష్ట్రంలో చేనేత మగ్గాలు 22వేలకు పెరిగాయని రాష్ట్ర చేనేత, జౌళిశాఖ జాయింట్ డైరెక్టర్ ఇందుమతి అన్నారు. - 10లో



ఇంటర్న్‌షిప్ కోర్సులతో..

ఇంటర్న్‌షిప్ కోర్సులతో విద్యార్థులకు బంగారు భవిష్యత్ ఉంటుందని ఎంజీయూ ఓఎస్‌డీ ప్రొఫెసర్ రవి అన్నారు. - 10లో

గరిష్టం/కనిష్టం 39°/29°

వాతావరణం

పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఉష్ణోగ్రత మోస్తారుగా ఉంటుంది. రాత్రి ఈదురు గాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముగిసిన టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

భువనగిరి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ముగిసాయి. ఈ నెల 14న ప్రారంభమైన పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాలు ఏర్పాటు చేశారు. చివరి రోజైన మంగళవారం సాంఘిక శాస్త్రం పరీక్షకు మొత్తం 162 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 135 మంది హాజరయ్యారు. 27 మంది గైర్హాజరైనట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ప్రధానాలయంలో మంగళవారం స్వయంభూలకు నిజాభిషేకం, ఆలయ విష్ణు పుష్కరిణి వద్ద క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించారు. వేకువజామునే ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం, అభిషేకం, అర్చన జరిపించారు. మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం వంటి పూజల్లో భక్తులు పాల్గొన్నారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆధ్యాత్మిక దినోత్సవ ఏర్పాట్లపై సమీక్ష



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

భువనగిరిటౌన్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించనున్న ఆధ్యాత్మిక దినోత్సవ ఏర్పాట్లపై మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులు, శాంతి సంఘాల సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మసీదులు, చర్చిలు, ఇతర ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు, ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, శాంతి సంఘం సభ్యులు బట్టు రామచంద్రయ్య, భాను ప్రకాష్, దేవప్రసాద్‌రావు, ఏషాల అశోక్, రెవరెండ్ సుదర్శన్, సందీప్, షరీఫ్, రఘుపీందర్, మాయ కృష్ణ, అమరేశ్వర శర్మ, తహసీల్దారులు వెంకట్‌రెడ్డి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ఆత్మకూరు(ఎం): నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఉప్పల ముత్యాలు ఆరోపించారు. మంగళవారం ఆత్మకూరు మండలంలోని కూరెళ్లలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు, నియామకాలతో అధికారంలోకి వచ్చిన తెలంగాణ ప్రభుత్వం గతంలో చేతి వృత్తులకు రుణాలు ఇస్తామంటూ దరఖాస్తులు స్వీకరించి ఇవ్వలేదన్నారు. సమావేశంలో వెంకటేశం, మారుపాక అంజయ్య, జన్నయ్య, సర్వయ్య, యాదయ్య, నారాయణ పాల్గొన్నారు.

పరిశుభ్రత పాటించాలి



చౌటుప్పల్‌లోని ఓ హోటల్‌లో ఆహార పదార్థాలను తనిఖీ చేస్తున్న అధికారులు

చౌటుప్పల్: హోటళ్లలో పరిశుభ్రత పాటించకుంటే చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ సుమన్ కళ్యాణ్, జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి హెచ్చరించారు. చౌటుప్పల్ మండల పరిధిలో జాతీయ రహదారి వెంట పలు గ్రామాల్లోని హోటళ్లలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వంట గదులను పరిశీలించారు. ఆహారంలో వినియోగిస్తున్న పలు రకాల సామగ్రికి సంబంధించిన శాంపిల్స్ సేకరించి, పరీక్ష నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించారు.

పూర్తికాకున్నా ప్రారంభమా!



యాదాద్రి కొండకు దిగువన నిర్మాణంలో ఉన్న అన్నదాన సత్ర భవనం

- యాదాద్రిలోని అన్నదాన సత్ర భవన నిర్మాణ పనులు 85శాతమే పూర్తి
- తిరుమల తరహాలో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణం
- ఏడాదిన్నర కావస్తున్నా ఇంకా కొనసాగుతున్న పనులు
- నేడు ఆధ్యాత్మిక దినోత్సవం సందర్భంగా భవనాన్ని ప్రారంభించనున్న మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి అన్నదాన సత్ర భవన నిర్మాణ పనులు పూర్తి కాకున్నా ప్రారంభోత్సవానికి దేవస్థానం అధికారులు సిద్ధమయ్యారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. భవన నిర్మాణ పనులు అసంపూర్తిగానే ఉన్నా.. పైగా ప్రస్తుతం ఆషాఢమాసమైనా ఇంత హడావుడిగా ప్రారంభించడంలో ఆంతర్యమేంటన్న ప్రశ్నలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి.

రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం..

అంతర్జాతీయ ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దుకున్న యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ ఆలయానికి భవిష్యత్‌లో భక్తుల తాకిడి పెద్దఎత్తున పెరిగే అవకాశం ఉంది. రోజూ లక్ష మంది భక్తులు వచ్చినా ఇబ్బందులు తలెత్తకుండా అన్న ప్రసాదం అందజేయాలన్నది ప్రభుత్వం సంకల్పించింది. అందుకనుగుణంగా తిరుమల తిరుపతి తరహాలో అన్న సత్ర భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. యాదాద్రి కొండకు దిగువన రెండు ఎకరాల విస్తీర్ణంలో రూ.22 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులు ప్రారంభించారు.

ఆధ్యాత్మిక హంగులు..

కొండ కింద దేవస్థానం ఆర్టీసీ బస్ ప్రాంగణం పక్కన 2.5 ఎకరాల స్థలంలో భవనాన్ని ఆధునిక హంగులతో, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఒక అంతస్తులో నిర్మిస్తున్నారు. ఇందులో రెండు హాళ్లు, కిచెన్, వెయిటింగ్ హాల్, డైనింగ్ హాల్, వీవీపీ సెక్షన్, వాష్ రూమ్స్ వంటివి రానున్నాయి. ఒక్కో హాల్ 6700 ఎస్ఎఫ్‌టీ చొప్పున రెండు హాళ్లలో ఏకకాలంలో 664 మంది భోజనం చేయడానికి వీలుగా నిర్మిస్తున్నారు. సువిశాలమైన వంటగది, కూరగాయలు భద్రపరిచే రూంలు, పెరుగు, పాల కోసం ప్రత్యేక గదిలో ఫ్రిజ్‌లు, 20 మంది కూర్చునే విధంగా వీవీఐపీ హాల్‌ను తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం ఒక హాల్ పనులు పూర్తి కాగా మిగతా పనులు కొనసాగుతున్నాయి.

45 రోజుల్లో పూర్తి..

అన్నదాన సత్ర భవనం పూర్తి కావడానికి ఇంకా నెలన్నర రోజులు సమయం పట్టే అవకాశం ఉన్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించే ఆధ్యాత్మిక దినోత్సవంలో భవనాన్ని ప్రారంభించి, ఆ తరువాత మిగతా పనులు చేపట్టనున్నట్లు పేర్కొంటున్నారు. అప్పటి వరకు భక్తులకు దీక్షాపరుల మండపంలోనే అన్న ప్రసాద వితరణ కొనసాగుతుందని అంటున్నారు. కాగా.. అన్నదాన సత్ర భవన ప్రారంభోత్సవానికి దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

పెండింగ్ పనులు ఇవీ..

అన్నదాన సత్ర నూతన భవనంలో ఎలక్ట్రీషియన్, కిటికీలు, నల్లాలు, కిచెన్, డైనింగ్ హాల్, వెయిటింగ్ హాల్, వాష్ రూమ్స్ , గ్రీనరీ పనులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆ పనులన్నీ వేగంగా పూర్తి చేసి నెలన్నరలో భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామని అధికారులు చెబుతున్నారు.



కుళాయిల వద్ద పనులు చేస్తున్న కూలీలు

వైటీడీఏ, వేగేశ్న ఆధ్వర్యంలో..

అన్నదాన సత్రం భవన నిర్మాణంలో భాగంగా పిల్లర్ల పనులను రూ.8 కోట్లతో వైటీడీఏ చేపట్టగా, మిగిలిన రూ.14 కోట్ల పనులను వేగేశ్న సంస్థకు అప్పగించారు. ప్రధానాలయం ఉద్ఘాటన నాటికే నూతన భవనాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యంతో పనులు ప్రారంభించారు. కానీ ఆలోగా పనులు పూర్తికాలేదు. ఆలయ ఉద్ఘాటన జరిగి 15 నెలలు గడుస్తున్నా ఇంకా పనులు కొనసాగుతూనే ఉన్నాయి. 85శాతం పనులు పూర్తి కాగా.. ఇంకా 15శాతం పనులు మిగిలి ఉన్నాయి.

విద్యారంగానికి ప్రాధాన్యతనిస్తున్న కేసీఆర్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, కలెక్టర్, జెడ్పీ చైర్మన్

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

భువనగిరి: విద్యారంగానికి సీఎం కేసీఆర్ అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. రాష్ట్ర అవరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణ శివారులోని ఏకే ప్యాలెస్‌లో విద్యా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఉండాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చదువుకోవాలనే తపన ఉన్న పిల్లలకు వారి తల్లిదండ్రులు అండగా ఉండాలన్నారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన ఊరు మన బడి ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల ప్రావిడెంట్ ఫండ్ ఫైల్స్ కూడా త్వరలో నల్లగొండ జిల్లా నుంచి మన జిల్లాకు వస్తాయని పేర్కొన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా అభ్యసనా పరికరాల ఎగ్జిబిషన్ నిర్వహించారు. సుమారు 170 మంది ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు తయారు చేసిన స్టాల్స్ ఏర్పాటు చేశారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ దీపక్ తివారీ జిల్లా విద్యాశాఖ ప్రగతి నివేదిక చదివి వినిపించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు జడల అమరేందర్, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినేటర్ కోల్పుల అమరేందర్, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, బీసీ సంక్షేమ అధికారి యాదయ్య, ఎంపీపీ నరాల నిర్మల, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతల కిష్టయ్య అధికారులు పాల్గొన్నారు.



అనాజిపురం పాఠశాలలో విద్యార్థులకు రాగిజావ తాపిస్తున్న ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి



ఎగ్జిబిషన్ స్టాల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

ఉత్తమ సేవలకుగాను ఉపాధ్యాయులకు అవార్డులు

షఫీజా అక్తర్ (ప్రిన్సిపాల్ పాలిటెక్నిక్ కళాశాల, యాదగిరిగుట్ట), లక్ష్మణ్ నాయక్(ప్రిన్సిపాల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరు), రామాంజనేయులు(ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల యాదగిరిగుట్ట), సంజీవ(ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల రామన్నపేట), సురేష్ కుమార్(ప్రిన్సిపాల్ టీఎస్ఎంఎస్, గుండాల), రఘురాంరెడ్డి(హెచ్‌ఎం, మోటకొండూరు), బాల్‌రెడ్డి(హెచ్‌ఎం, రఘునాథపురం, రాజాపేట), జ్యోతి(మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, మోటకొండూర్), శ్రీనివాస‌రెడ్డి(హెచ్‌ఎం, పోచంపల్లి), ఎస్‌వీ రామరాజు(హెచ్‌ఎం ముక్తా అనంతారం), సురేందర్‌రెడ్డి(హెచ్, నారాయణపురం), సరోజమ్మ(ప్రిన్సిపాల్ టీఎస్ఆర్ఎస్, చౌటుప్పల్), రూప(ప్రిన్సిపాల్, టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, అడ్డగూడూరు), హరిత(అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఫీజిక్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరు), మక్క(అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఇంగ్లిష్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరు), రమాదేవి (అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ పొలిటికల్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట), వెంకటేశం (అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ ఎకానమిక్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆలేరు), రమణప్రసాద్, ప్రణతి ప్రసాద్(పాలిటెక్నిక్ కళాశాల యాదగిరిగుట్ట), రాంప్రసాద్ (ఎస్ఏ, గణితం పారుపల్లి) అవార్డులు అందుకున్నారు.

ఎగ్జిబిషన్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు

శరణ్య(వలిగొండ), శ్రావ్య(రామన్నపేట), చందన(వలిగొండ), హరిణి (మోటకొండూరు), శిరీష, సుష్మిత, శ్రీవల్లి, ప్రశాంతి, ప్రవళిక, ప్రణవి, అఖిల(చౌటుప్పల్), శ్రావణి, సీహెచ్ స్పందన, ధరణి(ఆలేరు), శైలజ, చందన(పోచంపల్లి), సీహెచ్ వినోద్(నారాయణపురం) అవార్డులు అందుకున్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

గుండాల: వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గుండాల మండల కేంద్రంలో రైతులు రోడ్డుపై ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో వరిధాన్యాన్ని పోసి రెండు మాసాలు గడుస్తున్నా తూకం వేయలేదని ఆరోపించారు. తూకం వేసిన బస్తాలను తరలించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. తక్షణమే వరి ధాన్యాన్ని తూకం వేసి, మిల్లులకు పంపించాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ తాండ్ర అమరావతి ధర్నా వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడారు. సెంటర్‌లో పోసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, తూకం వేసిన బస్తాలను మిల్లులకు తరలిస్తామని హామీ ఇచ్చారు. ధర్నా కార్యక్రమంలో రైతులు అండెం కృష్ణారెడ్డి, రంగారెడ్డి, సోమయ్య, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



గుండాలలో ధర్నా చేస్తున్న రైతులు

క్లీన్‌చీట్ ప్రచారం సరికాదు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

సాక్షి, యాదాద్రి: ఐటీ సోదాలు జరిగిన తర్వాత తనకు క్లీన్ చీట్ వచ్చిందని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ప్రచారం చేసుకోవడం సరికాదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం భువనగిరి రహదారి బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరిపై ఐటీ సోదాలు జరిగినా కొంతకాలం విచారణ కొనసాగుతుందే తప్ప ఒక్కసారే క్లీన్‌చీట్ ఇవ్వరని తెలిపారు. రాయగిరి రీజినల్ రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ మార్పు కోసం ప్రధాని మోదీకి సీఎం కేసీఆర్ లేఖ రాయాలన్నారు. భువనగిరి నియోజకవర్గంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆరోపించారు. బునాదిగాని, పిల్లాయపల్లి కాల్వలు పూర్తి చేసి రైతులు సాగు ఇవ్వలేదన్నారు. నియోజకవర్గంలో ప్రజల సమస్యలపై బీజేపీ తరపున పోరాటం ఆగదని తెలిపారు.

రూ.లక్ష ఆర్థికసాయానికి 14,500 దరఖాస్తులు



రామన్నపేట తహసీల్దార్ కార్యాలయంలో బారులుదీరిన జనం

భువనగిరి, రామన్నపేట: బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం అందించనున్న రూ.లక్ష ఆర్థిక సాయానికి దరఖాస్తు చేసుకోవడానికి మంగళవారంతో గడువు ముగిసింది. దరఖాస్తులు చేసుకునేందుకు అర్హులు మీ సేవా కేంద్రాలకు పోటెత్తారు. ఓ వైపు సర్వర్ సతాయిస్తుండగా మరోవైపు బాండ్ పేపర్ల కొరత నెలకొంది. దీంతో చివరిరోజు రాత్రి పొద్దుపోయే వరకు దరఖాస్తు చేసుకున్నారు. నాలుగైదు రోజులుగా అర్ధరాత్రి వరకు పనిచేసినా రద్దీని నియంత్రించలేకపోతున్నామని అధికారులు పేర్కొంటున్నారు. కాగా.. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 14,500 దరఖాస్తులు వచ్చాయి.

బొమ్మలరామారంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత

భువనగిరిటౌన్: జూన్ మూడో వారంలోనూ ఎండల తీవ్రత ఏమాత్రం తగ్గడం లేదు. జిల్లా వ్యాప్తంగా దాదాపు అన్ని మండలాల్లో మంగళవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. బొమ్మలరామారంలో అత్యధికంగా 43 డిగ్రీలు నమోదు కాగా గుండాల మండలంలో 42.3, యాదగిరిగుట్ట 41.3 డిగ్రీలు, భువనగిరిలో 40.1 డిగ్రీలు నమోదైంది.

మేనిఫెస్టో అమలులో బీఆర్ఎస్ విఫలం

- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి: ఎన్నికల మేనిఫెస్టో అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం భూదాన్‌పోచంపల్లి పట్టణకేంద్రంలో హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ తొమ్మిదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 22న భువనగిరిలో దశాబ్ది తెలంగాణ దగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గ్రామాలు తిరుగుతూ సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నామని గొప్పలు చెప్పుకొంటున్నారని విమర్శించారు. పర్యాటక కేంద్రమైన పోచంపల్లిలో మినీ ట్యాంక్‌బండ్ ఏమైందని, మున్సిపాలిటీలో మిషన్‌భగీరథ నీళ్లు వస్తలేవని, డిగ్రీకళాశాల లేదని, 30 పడకల ఆస్పత్రి నిర్మాణం ఊసేలేదని, మూసీ ప్రక్షాళన, కంపెనీల కాలుష్యం, జూలూరు-రుద్రవెల్లి, ఇంద్రియాల-జంపల్లి గ్రామాల మధ్య బ్రిడ్జిలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమిత్ర టౌన్‌షిప్‌లో అక్రమ రిజిస్ట్రేషన్లు రద్దయిన 7వేల గజాల ప్రభుత్వ భూమిని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలని, గతంలో అన్యాక్రాంతమైన 5ఎకరాల ప్రభుత్వ భూమి అక్రమ రిజిస్ట్రేషన్లను కూడా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తడక వెంకటేశం, పార్టీ మండల అధ్యక్షుడు పాక మల్లేశ్, కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు మర్రి నర్సింహారెడ్డి, ఉపునూతుల వెంకటేశం, పట్టణ కోర్‌కమిటీ అధ్యక్షుడు భారత లవకుమార్, రాఘవరెడ్డి, సామ మోహన్‌రెడ్డి, అనిరెడ్డి జగన్‌రెడ్డి, బండారు ప్రకాశ్ రెడ్డి, మోటె రాజు, అంజిరెడ్డి, రాజిరెడ్డి, కృష్ణారెడ్డి, బిట్ల గణేశ్, శ్రీశైలం, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీసీసీ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌రెడ్డి

పఠన కేంద్రాలొస్తున్నాయ్..

- జిల్లాకు కొత్తగా 83 గ్రంథాలయాలు
- పబ్లిక్ రీడింగ్ రూమ్ పథకం కింద మంజూరు
- తొలి విడతలో ఆరు చోట్ల ఏర్పాటు
- వారంలో అందుబాటులోకి..

ఆత్మకూరు(ఎం) : పట్టణాలు, మండల కేంద్రాలకే పరిమితమైన శాఖ గ్రంథాలయాలు పల్లెలకూ విస్తరిస్తున్నాయి. అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడేలా రాష్ట్ర ప్రభుత్వం పబ్లిక్ రీడింగ్ రూమ్ పథకం కింద గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తోంది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు కొత్తగా 83 గ్రంథాలయాలు మంజూరయ్యాయి. తొలి విడతలో భువనగిరి పట్టణ పరిధిలోని సింగన్నగూడెం, 10 వార్డులో, రాజాపేట, ఆత్మకూర్(ఎం) మండలంలోని రహీంఖాన్‌పేట, రామన్నపేట మండలంలోని ఇంద్రపాలనగరం, మోత్కూరు మండలం పాలడుగులో ఏర్పాటు చేస్తున్నారు. ఇవి వారం రోజుల్లో అందుబాటులోకి రానున్నాయి.



జిల్లా కేంద్ర గ్రంథాలయం

మిగతా 77 గ్రంథాలయాల ఏర్పాటుకు సన్నాహాలు ప్రారంభించారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో..

పబ్లిక్ రీడింగ్ పథకం కింద మంజూరైన గ్రంథాలయాల ఏర్పాటు బాధ్యతలు ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు తీసుకోవాల్సి ఉంటుంది. గ్రంథాలయాలు ఏర్పాటు చేసిన అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ వాటిలో ర్యాక్‌లు, టేబుల్స్, కుర్చీలను సమకూర్చనుంది. అంతేకాకుండా గ్రంథాలయం నిర్వహణకు నెలకు రూ.1000, దినపత్రికలకు రూ.1000 చొప్పున చెల్లిస్తుంది. గ్రంథాలయం నిర్వహణ సక్రమంగా చేపడుతామని సర్పంచ్, కార్యదర్శి రెండేళ్ల పాటు జిల్లా గ్రంథాలయ సంస్థకు అగ్రిమెంట్ రాసి ఇవ్వాల్సి ఉంటుంది.

ప్రస్తుతం ఉన్న గ్రంథాలయాలు 15

నూతనంగా ఏర్పడిన మోటకొండూరు, అడ్డగూడూరు మండలాలు మినహా మిగతా 15 మండలాల్లో ఇప్పటికే శాఖ గ్రంథాలయాలు ఉనానయి. కొత్త మంజూరైన 8 గ్రంథాలయాలు అందుబాటులోకి వస్తే పాఠకులకు ప్రయోజనం చేకూరనుంది.

వారం రోజుల్లో ప్రారంభిస్తాం



పబ్లిక్ రీడింగ్ రూమ్ పథకం కింద జిల్లాకు 83 గ్రంథాలయాలు మంజూరయ్యాయి. తొలి విడతలో ఆరు గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తాం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సింగన్నగూడెంలో పూర్తయ్యింది. మిగతా గ్రామాల్లో వారం రోజుల్లో ప్రారంభిస్తాం.

-ఎం.సుధీర్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాకు కొత్తగా మంజూరైన గ్రంథాలయాల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులు సహకరించాల్సి ఉంటుంది. అనువైన చోట వసతి కల్పించాలి. గ్రంథాలయాల్లో రీడింగ్ బుక్స్, దినపత్రికలు అందుబాటులో ఉంచుతాం. యువకులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

- అమరేందర్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

క్లుప్తంగా

భార్యను దూషించాడని గొడ్డలితో దాడి

నూతనకల్ : పాత కక్షలను మనసులో పెట్టుకుని తన భార్యను దూషించాడని ఓ వ్యక్తి ప్రత్యర్థిపై గొడ్డలితో దాడి చేసి గాయపర్చాడు. నూతన్‌కల్ మండలం తాళ్లసింగారం గ్రామానికి చెందిన వీరబోయిన సైదులు, మోహనంది జానకిరాములు ఆటో డ్రైవర్లుగా జీవనం సాగిస్తున్నారు. వీరిద్దరికి పాత గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో సైదులు భార్య నాగమణి మంగళవారం గ్రామంలోని పశువుల కొట్టం వద్దకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తోంది. మద్యమత్తులో ఉన్న జానకిరాములు మార్గమధ్యలో ఆమెను అడ్డగించి దూషించాడు. దీంతో నాగమణి ఇంటికి వచ్చి విషయాన్ని భర్త సైదులుకు చెప్పడంతో మరికొందరితో జానకిరాములు వద్దకు వెళ్లి ఘర్షణకు దిగాడు. ఈ క్రమంలో సైదులు గొడ్డలితో జానకిరాములుపై దాడి చేయగా భుజానికి తీవ్ర గాయమైంది. అతడిని సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు. జానకిరాములు ఫిర్యాదు మేరకు సైదులుతో పాటు మరికొంత మందిపై, నాగమణి ఫిర్యాదు మేరకు జానకిరాములుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.

చోరీ కేసులో వ్యక్తి అరెస్ట్

రామన్నపేట : పరిచయస్తులను నమ్మించి స్కూటీని అపహరించుకుపోయిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కృష్ణాజిల్లా చిల్లకల్లు మండలం రెడ్డినాయక్ తండాకు చెందిన మాలావత్ సతీష్ ఈ నెల 18న రామన్నపేటలో పరిచయం ఉన్న వ్యక్తి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం లేచి ఆ ఇంట్లో ఉన్న స్కూటీని అపహరించుకుపోయాడు. సదరు కుటుంబ సభ్యులు స్కూటీ కోసం ఆరా తీయగా సతీష్ తీసుకువెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం రామన్నపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు చిక్కగా స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్ఐ లక్ష్మయ్య తెలిపారు.

ఒకరి దుర్మరణం

సూర్యాపేట క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. సూర్యాపేట పట్టణంలోని శాంతినగర్ ఎఫ్‌సీఐ గోదాం వద్ద సోమవారం రాత్రి ఈ ఘటన జరిగింది. మోతె మండలం హుస్సేన్‌బాద్ గ్రామానికి చెందిన రేఖ మల్లయ్య(34) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడు కోదాడ నుంచి సూర్యాపేట పట్టణానికి ఆర్టీసీ బస్సులో బయలుదేరాడు. మార్గమధ్యలో శాంతినగర్ ఎఫ్‌సీఐ గోదాం వద్దకు రాగానే ఆర్టీసీ బస్సు వెనుక నుంచి లారీని ఢీకొట్టింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న రేఖ మల్లయ్య అద్దాలను పగులగొడుతూ రోడ్డుపై పడిపోయాడు. అతడిపైనుంచి బస్సు చక్రాలు వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య అనిత ఫిర్యాదు మేరకు సూర్యాపేట సీఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు.

క్వింటాకు పది కిలోల తరుగు తీస్తారా..

- మర్రిగూడ పీఏసీఎస్ సీఈఓ, సిబ్బందిని నిర్బంధించిన రైతులు
- న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ


మర్రిగూడలో పీఏసీఎస్ సిబ్బందిని నిర్బంధించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మర్రిగూడ: మర్రిగూడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో మర్రిగూడ, యరగండ్లపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకొచ్చిన ధాన్యంలో క్వింటాకు పది కిలోల తరుగు ఎలా తీస్తారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు కేంద్రాల్లో 692 మంది రైతుల నుంచి 31,430 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు సమాచారం. అయితే తమ ఖాతాల్లో తక్కువ నగదు జమవ్వడంతో గత మూడు, నాలుగు రోజుల నుంచి బాధిత రైతులు ప్రశ్నిస్తున్నా పీఏసీఎస్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆగ్రహించిన రైతులు మంగళవారం సీఈఓతో పాటు సిబ్బందిని పీఏసీఎస్ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశారు. దాదాపు రెండు గంటల వరకు కొండూరు, మర్రిగూడ, యరగండ్లపల్లి గ్రామాలకు చెందిన రైతులు నిరసన వ్యక్తం చేసి అక్కడే ధర్నా నిర్వహించడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు పీఏసీఎస్ కార్యాలయానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి మర్రిగూడకు వస్తున్నారని విషయం తెలుసుకున్న రైతులు స్థానిక బస్టాండ్ వద్ద ఎమ్మెల్యేను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద మాట్లాడుదామని, ఎవరూ అధైర్యపడవద్దని రైతులను అక్కడికి పిలిపించుకొని మాట్లాడారు. జిల్లా అదనపు కలెక్టర్‌కు ఎమ్మెల్యే ఫోన్ చేసి రైతులను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాము అమ్మిన ధాన్యం వివరాలను తహసీల్దార్‌కు అందజేయాలని రైతులను ఎమ్మెల్యే సూచించారు. ఆయన వెంట ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, ఎంపీడీఓ జె. వెంకటేశ్వర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, దళితబంధు జిల్లా కమిటీ సభ్యుడు లపంగి నరసింహ, రైతులు ఉన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు, మల్లికార్జున్‌రెడ్డి

అడవిదేవులపల్లి : గ్రంథాలయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్‌రావు అన్నారు. మంగళవారం అడవిదేవులపల్లిలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలతో పాటు అన్ని రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. అనేక మంది గ్రంథాలయాల్లో చదువుకుని ఉన్నత స్థానాల్లోకి వెళ్లారని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కూరాకుల మంగమ్మ, కూరాకుల చిన రామయ్య, ఆర్డీఓ చెన్నయ్య, ఎంపీపీ ధనావత్ బాలాజీనాయక్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కొత్త మర్రెడ్డి, బాబ్జాని, సూర్యానాయక్, కుర్ర శ్రీనునాయక్ పాల్గొన్నారు.

అదృశ్యమై.. చెరువులో విగతజీవుడై..

- రాయగిరి చెరువులో మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభ్యం
- మృతుడు భువనగిరికి చెందిన ప్రైవేట్ ఉద్యోగిగా గుర్తింపు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

భువనగిరి : భువనగిరి మండలం రాయగిరి చెరువులో సోమవారం రాత్రి లభ్యమైన మృతదేహం ఆచూకీని పోలీసులు కనుగొన్నారు. మృతుడు భువనగిరి పట్టణానికి చెందిన ఆలకుంట్ల నవీన్(29)గా గుర్తించారు. పట్టణంలోని అర్బన్ కాలనీలో భార్యా, పిల్లలతో నివాసముంటున్న నవీన్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 17వ తేదీన బైక్‌పై ఇంటినుంచి బయటికి వెళ్లిన నవీన్ తిరిగి రాలేదు. స్నేహితులు, బంధువుల ఇళ్లలో కుటుంబ సభ్యులు ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో అతడి భార్య మీనా సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అదృశ్యం కేసు నమోదు చేశారు. అదే రోజు రాత్రి రాయగిరి చెరువు సమీపంలో బైక్ నిలిచి ఉండడంతో పాటు నీటిలో తేలియాడుతున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అదృశ్యం కేసు ఆధారంగా మృతుడు నవీన్‌గా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించగా అంత్యక్రియలు పూర్తి చేశారు. చేతికి తాడు కట్టుకుని నవీన్ నీటిలో దిగి మృతిచెంది ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి సోదరుడు ప్రవీణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

మిర్యాలగూడ అర్బన్: వడదెబ్బతో వ్యక్తి మృతిచెందాడు. మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన మలికంటి వీరయ్య(45) కూలీగా జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల ఎండవేడిమికి వడదెబ్బకు గురై ఇంట్లోనే చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలున్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు వీరయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన వారిలో సీపీఐ నాయకులు చిమట సైదులు, నక్క మట్టయ్య, నాగరాజు, వెంకటయ్య, రవి, గురువయ్య, సోమయ్య, అంజి, హనుమంతు, శివ, లింగయ్య, రాము తదితరులున్నారు.


నివాళులర్పిస్తున్న బంటు వెంకటేశ్వర్లు తదితరులు

లింగారెడ్డిగూడెంలో..

చౌటుప్పల్ : చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన సుర్కంటి అండమ్మ(80) తీవ్రమైన ఎండలు వడగాల్పులతో సోమవారం అస్వస్థతకు గురయ్యింది. ఇంట్లోనే చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించారు.

విద్యుదాఘాతంతో ఒకరికి తీవ్ర గాయాలు

పెద్దఅడిశర్లపల్లి : విద్యుదాఘాతంతో ఓ వక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలో మంగళవారం జరిగింది. పెద్దఅడిశర్లపల్లి మండలం కేశంనేనిపల్లి గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలోని విద్యుత్ స్తంభం ఇటీవల తెగిపోయింది. దానిని కలిపేందుకు విద్యుత్ కార్మికుడు రమావత్ బిక్కు ఎల్‌సీ ఇవ్వాలని విద్యుత్ అధికారులను కోరాడు.అధికారుల సమన్వయ లోపంతో కేశంనేనిపల్లి ఫీడర్ బంద్ చేయబోయి నడింబాయిగూడెం ఫీడర్‌ను బంద్ చేశారు. విద్యుత్ స్తంభం ఎక్కి జంపర్‌ను కలుపుతున్న రమావత్ బిక్కు విద్యుదాఘాతానికి గురై పైనుంచి కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రికి అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి బలవన్మరణం

కేతేపల్లి: వేర్వేరు చోట్ల ఇద్దరు బలవన్మరణానికి పాల్పడ్డారు. కేతేపల్లి, బీబీనగర్ మండలాల పరిధిలో చోటు చేసుకున్న ఈ ఘటనల వివరాలు..కేతేపల్లికి చెందిన పసల జయరాజు (60) భార్య మంగళవారం హైదరాబాద్‌కు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవటంతో మధ్యాహ్న సమయంలో జయరాజు ఉరేసుకున్నాడు. సాయంత్రం గమనించిన చుట్టుపక్కల నివాస గృహాల వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జయరాజు ఆత్మహత్యకు గల కారణాలు తెలియ రాలేదు. ఈ ఘటనపై ఫిర్యా దు అందలేదని ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.

రైలు కిందపడి..

బీబీనగర్: రైలు కిందపడి గుర్తుతెలియని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బీబీనగర్ పరిధిలోని పూసల గోడౌన్ సమీపంలో సుమారు 25నుంచి 30సంవత్సరాలు కలిగిన గుర్తుతెలియని యువకుడు పగిడిపల్లి– బీబీనగర్ రైల్వేట్రాక్ మార్గంలో యూపీకి వెళ్తున్న గూడ్స్‌కు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి ఒంటిపై తెల్లని షర్ట్, డార్క్ ప్యాంట్, కుడి చేతిపై రాగి కడెం ఉంది. మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు.

చనిపోయినా.. ఇద్దరి జీవితాలకు వెలుగు

- ఫక్కీరుగూడెంలో మృతురాలి నేత్రాలను దానం చేసిన కుటుంబ సభ్యులు


పార్వతమ్మ కుటుంబ సభ్యులకు నేత్రదానం ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న వైద్యులు

బొమ్మలరామారం : ఓ మహిళ చనిపోయినా ఇద్దరి జీవితాలకు వెలుగు ప్రసాదించింది. యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఫక్కీరుగూడెం గ్రామానికి చెందిన బొమ్మకంటి పార్వతమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పార్వతమ్మ నేత్రాలను దానం చేయాలని నిర్ణయించుకున్నారు. సికింద్రాబాద్ వాసవీ ఐ బ్యాంక్ వారికి సమాచారం ఇవ్వడంతో వచ్చి నేత్రాలను తీసుకున్నారు. పార్వతమ్మ జీవించి లేకున్నా కంటిచూపు లేని ఇద్దరికి వెలుగు ఇచ్చినట్లు ఐ బ్యాంక్ సిబ్బంది పేర్కొన్నారు. అనంతరం పార్వతమ్మ భర్త పర్వతాలు, కుమారులు మల్లేష్, మధుకు వాసవీ ఐ బ్యాంక్ నిర్వాహకులు నేత్రదానం ధ్రువీకరణ పత్రం అందజేశారు.

సామాజిక సేవలపై అవగాహన పెంచుకోవాలి


విద్యార్థులతో యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ దీపక్ తివారీ తదితరులు

- యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతి

భువనగిరి: చదువుతో పాటు విద్యార్థులు సామాజిక సేవలపై అవగాహన పెంచుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. 10వ తరగతిలో 10జీపీఏ సాధించిన 39మంది పాఠశాలల విద్యార్థులను మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె అభినందించి మెమెంటో, ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థులు తాము నిర్దేశించుకున్న లక్ష్యసాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ నారాయణరెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్ లక్ష్మీనర్సింహారెడ్డి, దిడ్డి బాలాజీ, డైరెక్టర్లు అంజయ్య, హమీద్ పాష, రాంబాయి, శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం దరఖాస్తు గడువు పొడిగించాలి


మాట్లాడుతున్న చక్రహరి రామరాజు

నల్లగొండ టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తులకు లక్ష రూపాయల ఆర్థికసాయం కోసం దరఖాస్తు గడువును మరో 20రోజులు పొడిగించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తులకు జతచేయాల్సిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జారీ చేయడంలో ఆలస్యమవుతున్నందున చాలా మంది దరఖాస్తులు చేసుకోలేకపోయారన్నారు. ఇప్పటికి వేలాది మంది సర్టిఫికెట్‌ల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. బీసీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయాలని, ఫెడరేషన్‌లకు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు బీసీ బంధును అమలు చేసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వైద్యుల సత్యనారాయణ, కోశాధికారి నల్ల సోమమల్లయ్య, సీనియర్ ఉపాధ్యక్షుడు కాసోజు విశ్వనాథం, గౌరవాధ్యక్షుడు కంది సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు కేశబోయిన శంకర్‌ముదిరాజ్ నకిరేకంటి కాశయ్యగౌడ్, గౌరవ సలహాదారు నేలపట్ల సత్యనారాయణ, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు చొల్లేటి రమేష్ పాల్గొన్నారు.

అక్రమంగా చెరువు మట్టి తరలింపు

నల్లగొండ రూరల్ : మండలం తోరగల్ గ్రామంలోని చెరువు నుంచి ఒండ్రు మట్టిని కొందరు అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. ఇటుక బట్టీల వ్యాపారులు స్థానిక నాయకులతో ఒప్పందం చేసుకుని మట్టిని తరలిస్తుండడంతో మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. 7 టిప్పర్లు పెట్టి రాత్రి సమయంలో ఒండ్రు మట్టి తరలించడంపై గ్రామస్తులు రెవెన్యూ, పోలీస్, నీటిపారుదల శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. మాదారంలో సైతం ఒండ్రు మట్టిని తరలించినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గ్రామస్తులు అడ్డుకుంటే తప్ప అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని తెలుస్తోంది.

తెలంగాణలో బీజేపీకి స్థానం లేదు

- ప్రధాని మోదీ నుంచి రాజ్యాంగాన్ని కాపాడాలి
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు


మాట్లాడుతున్న బీవీ రాఘవులు

మిర్యాలగూడ : కమ్యూనిస్టులు ఉన్నంతకాలం తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు పేర్కొన్నారు. మిర్యాలగూడలో మంగళవారం సీపీఎం నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ×ప్రస్తుత రాజకీయ పరిస్థితులు– మన కర్తవ్యాలు€ అనే అంశంపై రాఘవులు మాట్లాడారు. ప్రజా ఉద్యమాలు ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ఆటలు సాగవన్నారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తుందని ఆ ప్రమాదం నుంచి ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాల వైపు తిప్పాలని సూచించారు. ప్రజా ఉద్యమాలకు అండగా ఉండడానికి శాసనసభలో కమ్యూనిస్టు పార్టీల ప్రాతినిధ్యం అవసరమన్నారు. 12 శాతం జనాభా ఉన్న ముస్లింల సహకారంతోనే ఇప్పటివరకు పార్టీలు అధికారం చేపట్టాయని గుర్తు చేశారు. బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలన్నారు. మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే ఈ దేశాన్ని పూర్తిగా మత రాజకీయంగా మారుస్తాడన్నారు. రైస్‌మిల్లులన్నీ అదానీ మిల్లులుగా మారిపోతాయని ఎద్దేవా చేశారు. రాష్ట్రాలకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వకుండా కేంద్రం వివక్ష చూపుతోందన్నారు. ఉత్తర భారతదేశంలో మోదీకి మిత్రులు తగ్గిపోతున్నారని దానిని కవర్ చేయడానికి దక్షిణ భారతదేశంలో ప్రధానంగా తెలంగాణపై ఫోకస్ పెట్టారన్నారు. అక్కడ సీట్లు తగ్గితే ఇక్కడ వచ్చిన సీట్లతో సర్దుబాటు చేసుకోవచ్చని చూస్తున్నారని అన్నారు. మోదీ విధానాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, తీగల సాగర్, జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు యువకుడి మృతి


గోపి(ఫైల్)

మాడ్గులపల్లి: పిడుగుపాటుకు యువకుడు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు గ్రామానికి చెందిన కునుకుంట్ల లింగయ్య, లక్ష్మి దంపతులకు కుమారుడు, కూతురు సంతానం. కుమారుడు కునుకుంట్ల గోపి(21) సూర్యాపేటలోని ఓ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఉదయం గొర్రెలను మేపేందుకు పాములపాడులోని తమ పక్కింటి వ్యక్తితో కలిసి వ్యవసాయ క్షేత్రాలకు తోలు కెళ్లాడు. సాయంత్రం ఈదురు గాలులతో వర్షం ప్రారంభం కావడంతో వారిద్దరు ఓ చెట్టు కిందికి వెళ్లారు. చెట్టు సమీపంలో పిడుగు పడడంతో గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. మరో వ్యక్తికి ప్రాణాపాయం తప్పింది.

ఉట్లపల్లిలో..


మూగజీవాల కళేబరాల వద్ద బాధితుడు లింగయ్య

గుర్రంపోడు : గుర్రంపోడు మండలం ఉట్లపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో పాటు వర్షం కురిసింది. ఈ క్రమంలో గ్రామంలోని చెట్టు మీద పిడుగుపడడంతో దాని కింద ఉన్న లింగయ్యకు చెందిన నాలుగు చొప్పున మేకలు, పొట్టేళ్లు మృతిచెందాయి

రైలు ఢీకొని ఒకరి మృతి

ఆలేరురూరల్ : రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. ఆలేరులోని పెద్దమ్మ వాడకు చెందిన లక్కాకుల లక్ష్మీనారాయణ(56) పట్టణంలోని పాత రైల్వేగేటు ప్రాంతంలో కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజూ మాదిరిగా లక్ష్మీనారాయణ మంగళవారం ఉదయం 7గంటలకు దుకాణం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ యార్డు సమీపంలో పట్టాలు దాడుతుండగా సికింద్రాబాద్ వైపు వెళ్తున్న చార్మినార్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

'పేట' పద్మశాలీ కన్వీనర్‌గా ప్రమాణ స్వీకారం


గోవిందరావు చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్

హుజూర్‌నగర్: తెలంగాణ ప్రాంత పద్మశాలీ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం మంగళవారం హుజూర్‌నగర్‌లోని పద్మశాలీభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం. ప్రభాకర్, కె. మురళీ ఇటీవల నూతనంగా నియమితులైన జిల్లా కన్వీనర్ బి. గోవిందరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి. వేణుగోపాల్, ఉపాధ్యక్షుడు పి. రవికుమార్, సంఘ నాయకులు బి. రఘురాం, వి. సాగర్, ఎ. శ్రీనివాస్, నరేష్, సత్యనారాయణ, రంగారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్సే

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కేతేపల్లి మండలంలో సాగిన పాదయాత్ర


కేతేపల్లిలో సాగుతున్న మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర

కేతేపల్లి : రైతులు, పేదల కష్టాలు తీరే రోజులు దగ్గరలోనే ఉన్నాయని.. తెలంగాణలో అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని సీఎల్పీ నేత బట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. ఆయన చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర మంగళవారం 96వ రోజు కేతేపల్లి మండలంలో సాగింది. ఇనుపాముల శివారు వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా కొర్లపహాడ్, కేతేపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా భట్టి రోడ్డు వెంట నిల్చుని ఉన్న వృద్ధులు, మహిళలు, ఉపాధిహామీ కూలీల సమస్యలను తెలుసుకున్నారు. కొర్లపహాడ్ వద్ద ఉపాధి కూలీలు తమ సమస్యలు భట్టితో చెప్పుకున్నారు. ఉపాధి హామీ కూలి డబ్బులు సకాలంలో అందటం లేదని చెప్పారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకానికి సరిపడా నిధులు కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేస్తామన్నారు. రూ.500కే వంటగ్యాస్ సిలిండర్ ఇస్తామని, ఇల్లు లేని ప్రతి కుటుంబానికి రెండు గదుల ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గాన్ని పూర్తి చేసి గ్రావిటీ ద్వారా సాగు నీరందిస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, పీసీసీ నేత దైద రవీందర్, వేదాసు శ్రీధర్, యూసుఫ్‌జానీ, కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భట్టితో దామోదర్‌రెడ్డి భేటీ..

మల్లు భట్టి విక్రమార్కతో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. కేతేపల్లి మండలంలోని ఇనుపాముల వద్ద జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన పాదయాత్ర శిబిరం వద్దకు దామోదర్‌రెడ్డి వచ్చి భట్టిని కలిశారు. ఈ సందర్భంగా వారు దాదాపు అరగంట పాటు మాట్లాడుకున్నారు. ఈనెల 21, 22, 23 తేదీల్లో సూర్యాపేట జిల్లాలో కొనసాగునున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర, కార్నర్ మీటింగ్‌ను విజయవంతం చేసే అంశంపై వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. సూర్యాపేట నియోజకవర్గంలో పాదయాత్ర విజయవంతం కోసం దామోదర్‌రెడ్డి చేస్తున్న సన్నాహకాలపై భట్టి అభినందించారు.

వరి నారు.. జాగ్రత్తలు


మధు శేఖర్, శాస్త్రవేత్త



పాడి పంట

ఆత్మకూరు(ఎం): యాదాద్రిభువనగిరి జిల్లాలో వరి కోతలు అయిపోయి రైతులు తిరిగి సాగు పనిలో నిమగ్నం అయ్యారు. అందులో భాగంగా పొలం పనుల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు. జిల్లాలో ముఖ్యంగా పోచంపల్లి, వలిగొండ, ఆత్మకూరు(ఎం), బీబీనగర్, మోత్కూరు, గుండాల ప్రాంతాల్లో వరిని అధికంగా సాగు చేస్తారు. దీంతో మొలకెత్తిన విత్తనం నుంచి వరి నారు తీసి నాటడం వరకు రైతులు పాటించాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా ఏరువాక శాస్త్రవేత్త మధు శేఖర్ సలహాలు, సూచనలు.

- నారుపోసే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలి.తడి విత్తనశుద్ధికి కార్బండిజమ్ 1 గ్రాం. లేదా పొడి విత్తనశుద్ధికి 3 గ్రాములు కిలో విత్తనాలకు చొప్పున కలిపి విత్తుకోవాలి.
- నారుమడి తయారీకి 2 వారాల ముందు, 2 గుంటల నారుమడికి 2 క్వింటాళ్లు బాగా మాగిన పశువుల ఎరువును వేసి పొలాన్ని రెండు, మూడు సార్లు కలియదున్నాలి.
- ఎకరం నాటుకోవడానికి, రెండు గుంటల్లో అతి సన్న గింజ రకాలైతే 15 కిలోలు సన్నగింజ రకాలైతే 20కిలోలు, దొడ్డు గింజ రకాలైతే 25కిలోల విత్తనం ఎత్తుమడులపై చల్లుకోవాలి.
- విత్తనం వత్తుగా చల్లుకున్నట్లయితే నారుపెరుగుదల బలహీనంగా ఉంటుంది.
- రెండు గుంటల నారుమడికి 2 కిలోల నత్రజని (1 కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12–14రోజులకు), కిలో భాస్వరం, 1కిలో పొటాష్ నిచ్చే ఎరువులను వేసుకోవాలి.
- మొలక కట్టిన విత్తనాన్ని చల్లి, వారం రోజులు ఆరుతడులు ఇచ్చి ఆ తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉంచాలి.
- జింక్ లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారీ చేయాలి.
- నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డి జాతి కలుపు నివారణకు విత్తిన 15–20రోజులకు సైహాలోఫాస్–పి–బ్యూటైల్ 1.5ఎంఎల్, లేదా అన్ని రకాల కలుపు ఉన్నప్పుడు బిస్‌పైరిబ్యాక్ సోడియం 0.5ఎంఎల్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి విత్తిన 10–12రోజులకు పిచికారీ చేసుకోవాలి.
- నారుపీకడానికి వారం రోజుల ముందు ఎకరాకు సరిపోయే నారుమడికి 800 గ్రాముల కార్బోఫ్యూరాన్ గుళికలను చల్లుకోవాలి.